క్లుప్తంగా

కస్టమ్స్ అధికారిగా రైతుబిడ్డ



నియామక పత్రం అందుకుంటున్న పవన్

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతయ్య గారిపల్లి పంచాయతీలోని రాజుగారిపల్లి గ్రామానికి చెందిన రైతుబిడ్డ పవన్ కుమార్ రెడ్డి సీజీఎల్ ఆల్ ఇండియా 422వ ర్యాంక్ సాధించి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ కస్టమ్స్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. నాగా శ్రీనివాసులు రెడ్డి, మాలతీ దంపతుల ద్వితీయ కుమారుడు పవన్ కుమార్ రెడ్డి చెన్నైలోని శాస్త్రీ భవన్‌లో సీఎం రోజ్‌గారి మేళా సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమక్షంలో కస్టమ్స్ అధికారి సుప్రీయ చందన్ చేతులమీదుగా నియమాకపత్రం అందుకున్నారు. పవన్ కుమార్ సాధించిన ఘనత పట్ల తల్లిదండ్రులతోపాటు బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయన్ను అభినందించారు.

కొల్లం బ్రహ్మానందరెడ్డి చిరస్మరణీయుడు



బ్రహ్మానందరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రైల్వేకోడూరు : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్, రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వర్గీయ కొల్లం బ్రహ్మానందరెడ్డి 6వ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, సాయి కిషోర్‌రెడ్డి, మందల నాగేంద్ర, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సుధాకర్‌రాజు, వైఎస్ అన్వర్ బాషా, జెట్పీటీసీ రత్నమ్మ, సీహెచ్.రమేష్, ఉప సర్పంచ్ తోట శివసాయి, జనార్దన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో వెలసిన భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజ నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు రాహుకాల పూజ విశేషాలు అర్చకులు వివరించారు.

అన్నదానం

రాయచోటిటౌన్ : పట్టణ పరిధిలోని మదనపల్లె రోడ్డు ఎంఎస్ఆర్ కాలనీలో గత 12 రోజులుగా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ చవితి వేడుకలలో భాగంగా స్వామి వారి చావిడి దగ్గర ప్రతి రోజు భక్తులకు ఉచితంగా అన్న ప్రసాదాన్ని అందజేస్తున్నారు. శుక్రవారం మడితాటి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

కోటలో షూటింగ్ సండడి

సిద్దవటం: మండల కేంద్రంలోని మట్లిరాజుల కోటలో శుక్రవారం కలియుగం పట్టణంలో సినిమా షూటింగ్‌ను చిత్రీకరించినట్లు సినిమా డైరెక్టర్ రమాకాత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఈ సినిమాలో హీరో, హీరోయిన్‌లుగా విశ్వ కార్తికేయ, అయిష్ పటేల్ నటిస్తున్నారన్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 45రోజులపాటు కడప అందాలను ఈ సినిమాలో చిత్రీకరించనున్నారు.

చౌడేశ్వరి ఆలయంలో చోరీ

గాలివీడు : మండలంలోని గోరాన్‌చెరువు గ్రామం ఆవులశెట్టివారిపల్లె చౌడేశ్వరీ ఆలయంలో దొంగలు గురువారం హుండీ పగులకొట్టి నగదు చోరికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. నెల రోజుల వ్యవధిలోనే నాలుగు ఆలయాల్లో చోరీ జరిగిందని, పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షులు వీరే

రాయచోటి : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుల పేర్లను ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. అన్నమయ్య జిల్లాలోని 3 నియోజకవర్గాలకు చెందిన 19 మండలాల పార్టీ అధ్యక్షుల పేర్లను శుక్రవారం ప్రకటించింది.

అధ్యక్షుడి పేరు	మండలం
సిద్దవటం	నీలకంఠారెడ్డి
ఒంటిమిట్ట	గజ్జల శ్రీనివాసులురెడ్డి
నందలూరు	అన్నం నగేంద్రమూర్తి
రాజంపేట(రూ)	బొల్లినేని రామ్మోహన్‌నాయుడు
రాజంపేట(టౌ)	జె.వెంకటకృష్ణయాదవ్
వీరబల్లి	ఉమామహేశ్వర్ రాజు
సుండుపల్లి	ఎం.రామస్వామిరెడ్డి
పెనగలూరు	కె.చక్రపాణి
పుల్లంపేట	షేక్.ముస్తాక్ సయ్యద్
ఓబులవారిపల్లి	సాయికిశోర్‌రెడ్డి
చిట్వేలి	శ్రీనివాసులురెడ్డి
కోడూరు	సుధాకర్‌రాజు
సంబేపల్లి	నాగిరెడ్డిగారి ఉదయ్‌కుమార్‌రెడ్డి
చిన్నమండెం	పి.సుధామాధురి
లక్కిరెడ్డిపల్లి	మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి
రామాపురం	గడికోట జగన్నాథరెడ్డి
గాలివీడు	ఎం.యదుభూషణ్‌రెడ్డి
రాయచోటి(రూ)	పోలు సుబ్బారెడ్డి
రాయచోటి(టౌ)	రియాజుర్ రెహమాన్

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

- జిల్లా కేంద్రంలో రూ. 3 కోట్లతో డీఎస్పీ, ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లకు నూతన భవనలు
- అక్టోబర్‌లో ప్రారంభానికి పోలీసు అధికారుల చర్యలు



ప్రారంభానికి సిద్ధమైన డీఎస్పీ కార్యాలయ భవనం

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో శాంతి భద్రతల పరిరక్షణకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణతో పోలీస్ చర్యలు ముందుకు సాగుతున్నాయి. జిల్లా కేంద్రం ఏర్పాటుతో రాయచోటి పట్టణంలో డీఎస్పీ, ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల ఆవశ్యకత ఏర్పడింది. వెనువెంటనే స్థలాల కేటాయింపు, భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ. 3 కోట్లను విడుదల చేసి పనులను ప్రారంభించింది. రాయచోటి పట్టణ ప్రాంతంలో విస్తరిస్తున్న జనాభా, వాహనాల రద్దీ దృష్ట్యా పెరిగిపోతున్న ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు ఆవశ్యకమని తెలిసిందే.

రూ. 3 కోట్లతో నిర్మాణాలు

రాయచోటిలో ట్రాఫిక్ పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి రూ. 2 కోట్లు, డీఎస్పీ కార్యాలయ భవన నిర్మాణానికి ఒక కోటి నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ను పట్టణంలోని చిత్తూరు మార్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా 1.14 ఎకరాలలో, డీఎస్పీ కార్యాలయాన్ని కడప రహదారి మార్గంలో ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా 1.50 ఎకరాలలో అధునాతన, సుందర నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేశారు. ఈ భవనాలను అక్టోబర్ నెలలో ప్రారంభించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో..

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుతో పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్దీకరణ దోహదపడుతుంది. రోజురోజుకు విస్తరిస్తున్న పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా స్టాఫ్ ఉండటంతో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ సులభతరం అవుతోంది. ఎస్ఐ స్థాయి ఉన్న స్టేషన్‌ను త్వరలోనే సీఐ స్థాయి అధికారిని ఏర్పాటు చేసేలా పోలీసు అధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. అలానే రాయచోటి ప్రజలు గతంలో చిన్న మైక్ పర్మిషన్ కావాలన్నా, ఇతర డివిజనల్ పోలీసుశాఖ పనులపై పులివెందులకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ వ్యయ ప్రయాసలు తప్పాయి. డీఎస్పీ రాయచోటిలోనే అందుబాటులో ఉండటం స్థానిక పోలీసు అధికారుల సమన్వయంతో మెరుగ్గా సేవలు అందించే అవకాశం ఏర్పడింది.

అన్ని కార్యాలయాలకు అధునాతన భవనాలు



అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో అన్ని జిల్లా, డివిజన్ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు అధునాతన భవనాలు నిర్మించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో స్థలాల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రణాళిక ప్రకారం అన్ని కార్యాలయాలను పూర్తి చేసే చర్యలు తీసుకుంటాం.

– గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే, రాయచోటి

రాజంపేటలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్



పూడికతీత పనులు చేపడుతున్న పారిశుధ్య కార్మికులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని అన్ని వార్డుల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త, మట్టిని పూర్తిస్థాయిలో తొలగించే కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. దాదాపు దశాబ్ద కాలం తరువాత డ్రైనేజీలు పూర్తిస్థాయిలో శుభ్రం అవుతుండటంతో పట్టణ ప్రజల్లో ఆనందం వ్యక్తం అవుతోంది. మున్సిపాలిటీ పరిధిలోని అనేక ప్రాంతాల్లో డ్రైనేజీలు పూడిపోవడంతో వర్షాకాలం మురికినీరు రోడ్లపైకి వస్తుండేది. అలాగే డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడం వల్ల మురికినీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్వాసన వచ్చేది. ఆ సమయంలో శానిటేషన్ అధికారులు తాత్కాలికంగా సమస్యను పరిష్కరించి చేతులు దులుపుకునేవారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటం, అలాగే రానున్నది వర్షాకాలం కావడంతో పట్టణంలో డ్రైనేజీల పరిస్థితిని ప్రజలు ఇటీవల మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చైర్మన్ మున్సిపాలిటీకి చెందిన ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి డ్రైనేజీల పరిస్థితిపై చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలకు పూనుకున్నారు. అందులో భాగంగా కడప నుంచి డ్రైనేజీల్లో పూడికలు తీసే పదిహేను మంది కూలీలను రప్పించి డ్రైనేజీల్లో మురికి నీరు ఏమాత్రం నిల్వవుండకుండా ఉండేలా పూడిక తీత పనులు చేయిస్తున్నారు. దాదాపు రెండు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పోలా విలేకరులతో మాట్లాడారు. దోమల వ్యాప్తికి మురికి నీరే ప్రధాన కారణమని అందువల్ల డ్రైనేజీల్లో పూర్తిస్థాయిలో పూడికతీత పనులను చేయిస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ఇకపై అలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ తొలి ప్రాధాన్యత అన్నారు. పారిశుధ్య నివారణకు ప్రజలు తమవంతు సహకరించాలని ఆయన కోరారు.

సీవీడీపై అవగాహన

నందలూరు (రాజంపేట) : కార్డియో వస్కులర్ డిసీజ్ (సీవీడీ) వల్ల కలిగే దుష్ప్రభావాలను, వాటిని ఎలా అధికమించాలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, శిల్పి ఆనందాచారి ప్లకార్డులు ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఇంటర్నేషనల్ హార్ట్ డేను నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించుకున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు రవిశంకర్ రెడ్డి, హృదయ నమూనాను విద్యార్థులు ద్వారా ప్రదర్శింపజేశారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

రాజంపేట టౌన్ : జిల్లా పోటీలకు పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల రాజంపేట ప్రభుత్వ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో మండలంలోని తాళ్లపాక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 800 మీటర్ల పరుగు పందెంలో గణేష్‌రాజు, హై జంప్‌లో శివ కుమార్‌రాజు జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో శుక్రవారం ఆ పాఠశాల హెచ్‌ఎం వనజాక్షి ఆ విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయురాలు రాణి పద్మజను అభినందించారు.

ఆధ్యాత్మిక సేవ చేయడం అదృష్టం




కల్యాణమండపంను ప్రారంభిస్తున్న మేడా రఘునాథరెడ్డి

రాజంపేట : ప్రజాసేవతోపాటు ఆధ్యాత్మికసేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామని ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత, రాజంపేట ఎమ్మెల్యే సోదరుడు మేడా రఘునాథరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాదులోని మియాపూర్ మయూరి నగర్‌లో ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండ్రస్టీస్ ప్రైవేటులిమిటెడ్, మేడా ప్రిస్టేజి ప్రాజెక్ట్ నేతృత్వంలో మేడా సాయికృష్ణారెడ్డి దాత సహకారంతో రూ.45లక్షలతో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండపంను శుక్రవారం ప్రారంభించారు.

ప్రతి రైతు ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించాలి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి డివిజన్ పరిధిలో పంట సాగు చేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు, వీరబల్లి మండలాలకు చెందిన వ్యవసాయ ఆర్‌బీకేలలో సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలస్యంగా వర్షాలు కురిసినందున ఉలవలు అవసరమైన ప్రతి రైతుకు అందించాలన్నారు. డివిజన్ పరిధిలో నాలుగు మండలాలకు 1826 క్వింటాళ్ల ఉలవలు వచ్చాయని, అందరికీ అందేటట్టు చూడాలన్నారు. అలాగే ప్రతి మండలంలో పొలం బడి కార్యక్రమం చేపట్టాలన్నారు. పంటల బీమా రావాలంటే ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సురేష్, బాబురావు, నాగమణి, స్వాతి, మురళీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో పౌర్ణమి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని కళ్యాణ వేదిక వద్ద అర్చకులు ఉత్సవ మూర్తులను వేర్వేరుగా కొలువుంచారు. అనంతరం సీతారాముల విగ్రహాలను సుగంధద్రవ్యాలు, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, కొబ్బరి నీళ్లతో అభిషేకించారు. నూతన పట్టు వస్త్రాలు ధరింపజేసి, తులసీ గజమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సతీసమేతుడైన కోదండ రామస్వామికి ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా పౌర్ణమి కళ్యాణం నిర్వహించారు. కల్యాణం పూర్తయ్యాక భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సీఎం వైఎస్ జగన్ మహిళా పక్షపాతి



కార్యక్రమంలో పాల్గొన్న సాయికిషోర్‌రెడ్డి, అధికారులు

ఓబులవారిపల్లె : సీఎం జగన్ మహిళా పక్షపాతి అని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ అధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణ పోషణ కార్యక్రమానికి సాయికిషోర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిబిడ్డలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం సంపూర్ణ పోషణ ద్వార పౌష్టికాహారం అందిస్తుందని అన్నారు. దీంతో రక్తహీనత తగ్గి తల్లి బిడ్డలు సురక్షితంగా ఉంటారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలన్ని మహిళల పేరు మీదనే ఇస్తున్నట్టు గుర్తుచేశారు. అనంతరం రైల్వేకొడూరు సీడీపీఓ సౌభాగ్యమ్మ, ఎంపీడీఓ విజయారావు మాట్లాడారు. అలానే గర్భిణులకు శ్రీమంతం నిర్వహించి ఆశీర్వదించారు. పౌష్టిక ఆహారం పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ, వైద్యులు గురు మహేష్, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలాన, మండల సూపర్‌వైజర్‌లు అనసూయమ్మ, పార్వతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి

దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన సైనికులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సాయికిషోర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ చీర్ల నాగమ్మ, సాయికిషోర్‌రెడ్డి డ్వాక్రా సంఘాల మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు, నాయకులతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. మండలంలో సేకరించిన మట్టిని గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కె.పార్థసారధికి అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక




ఎంపికైన క్రీడాకారులతో క్రీడా నిర్వాహకులు

రాయచోటి టౌన్ : అండర్ – 19 రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు రాయచోటి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ రేఖ, ఫిజికల్ డైరెక్టర్ రేవతి తెలిపారు. ఈ నెల 26వ తేదీ మైదుకూరులోని శ్రీ మేధ అకాడమీలో నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలో కృష్ణవేణి, రెడ్డెమ్మ, పద్మజ, మౌనిక, వనిత, అభిరామ్, విఘ్నేషలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని శుక్రవారం రాయచోటి – సుండుపల్లె రోడ్డులో ఉన్న ఏపీ మాడల్ స్కూల్లో అభినందించారు. అలానే పాఠశాలకు ముగ్గురు విద్యార్థులు అంజలి, భువనేశ్వరీ, అనన్యలు రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారని తెలియజేశారు.


రాష్ట్ర స్థాయికి 64 మంది ఎంపికయ్యారు

రాష్ట్రస్థాయికి వివిధ క్రీడలలో 64 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని కడప జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.అరుణకుమారి, అన్నమయ్య జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత తెలిపారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని మాసాపేట జెడ్పీహెచ్‌ఎస్ మైదానంలో నిర్వహించిన అండర్ – 14, అండర్ – 17 విభాగాలలో జిల్లా స్థాయి సాఫ్టబాల్, బేస్‌బాల్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించామన్నారు. ఈ క్రీడలలో జిల్లా స్థాయి నుంచి మొత్తం 600 మంది క్రీడాకారులు పాల్గొనగా బాలబాలికల నుంచి మొత్తం 64 మంది రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జన వేడుకలు



రాజంపేట టౌన్: నిమజ్జనానికి తరలుతున్న గణేశుడు



నిమజ్జనంలో చెక్క భజనలు చేస్తున్న కళాకారులు

రాజంపేట టౌన్ : పదకొండు రోజులపాటు భక్తుల పూజలందుకున్న లంబోదరుడు గంగమ్మ ఒడికి చేరాడు. చవితి రోజు నుంచి విశేష పూజలందుకున్న గణనాథునికి మూడవ రోజు నుంచి నిమజ్జన వేడుకలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి నిత్యం వివిధ ప్రాంతాల్లో నిమజ్జన వేడుకలు కొనసాగుతూ వచ్చాయి. అయితే గురువారం రాత్రి పూర్తిస్థాయిలో నిమజ్జన వేడుకలు పూర్తయ్యాయి. ఇదిలావుంటే ప్రతి ఏడాది ఎక్కడో ఒక చోట అపశృతులు, విషాధ సంఘటనలు చోటుచేసుకునేవి. ఈ ఏడాది డీఎస్పీ వీఎన్‌కే చైతన్య నేతృత్వంలో పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో ప్రశాంత వాతావరణంలో నిమజ్జన వేడుకలు ముగిశాయి.

సిద్దవటం : మండలం కేంద్రమైన సిద్దవటం గాంధీ వీధిలో, కమ్మపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు శుక్రవారం నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వినాయకుడి విగ్రహానికి ఊరేగింపు నిర్వహించారు. సిద్దవటం గాంధీవీధిలోని వినాయక స్వామి విగ్రహం వద్ద లడ్డూ వేలం పాటను నిర్వహించగా స్థానికుడు పోతురాజు అబ్బిరెడ్డి రూ. 40వేలకు దక్కించుకున్నారు. సిద్దవటం పెన్నానదిపై నిర్మించిన హైలెవల్ వంతెన వద్ద నుంచి స్వామి వారి విగ్రహాన్ని పెన్నా నీటిలో నిమజ్జనం చేశారు.

సమస్యల శాశ్వత పరిష్కారమే లక్ష్యం



ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

రాజంపేట : నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల్లోని ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం మేడా భవన్‌లో నియోజకవర్గంలోని పలుమండలాల నుంచి వచ్చిన ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరిని ఆత్మీయంగా పలుకరించి, వారి కష్టాలను తెలుసుకున్నారు. అక్కడక్కడే సమస్య పరిష్కారం కోసం సంబంధిత జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో ఫోన్‌ద్వారా మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు చేకూరేలా సంక్షేమాన్ని తీసుకొచ్చారన్నారు. అలాగే సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి, రాష్ట్రంలో విజయవంతంగా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. సీఎం బాటలోనే తాను కూడా ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, వీలైనంత వరకు తన శక్తి మేర పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షుడు పసుపులేటి సుధాకర్, కౌన్సిలర్ కూండ్ల రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పృథ్వీరెడ్డి, యేల్చూరి అశోక్, మలిశెట్టి శ్రీనివాసులగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హరిత విప్లవ పితామహుడికి ఘన నివాళి



స్వామినాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సంబేపల్లె : దేశ ఆహార భద్రతకు ఆద్యుడు, హరిత విప్లవ హితామహుడైన ఎంఎస్ స్వామినాథన్ మృతి దేశానికి తీవ్రలోటని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయం వద్ద ఎంఎస్ స్వామినాథన్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి వరి వంగడాలతో, పుష్పాలతో అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంఎస్ స్వామినాథన్ భారత వ్యవసాయ రంగానికి ఎనలేని కృషి చేసి ఆహార భద్రతకు పెద్దపీట వేశారన్నారు. గోధుమ, వరి, బంగాళదుంప తదితర పంటలపై పరిశోధనలు చేసి అధిక దిగుబడులను అందించే నూతన వంగడాలను రైతులకు అందించారన్నారు. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా వ్యవసాయ రంగంలో నూతన పరిశోధనలకు ఆయన తోడ్పాటును అందించారన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహులు, వ్యవసాయ మండలి చైర్మన్ వాసుదేవ రెడ్డి, నాయకులు రమణారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు

సిద్దవటం : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు, సేవలను అందించుటకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని శుక్రవారం ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలో 30వ తేదీ శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతాయన్నారు. ఈ కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలు హాజరవుతారన్నారు. 30వ తేదీ ఉప్పరపల్లె గ్రామంలో, అక్టోబర్ 5న వంతాటిపల్లెలో, 7న మాచుపల్లెలో, 10న టక్కోలిలో, 12న జ్యోతిలో, 17న సిద్దవటంలో, 19న మాధవరం–2లో, 26న బొగ్గిడివారిపల్లెలో, 28న పెద్దపల్లిలో జరుగనున్నాయన్నారు. ఈ క్యాంపులు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం తరువాత రెండవ సెషన్స్‌గా ముగుస్తుందన్నారు. వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్‌లు, ఎవరికైతే టోకన్‌లను పంపిణీ చేస్తారో ఆ వ్యాధి పీడుతులను క్యాంపు దగ్గరకి తీసుకురావాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ తెలిపారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల వ్యాప్తంగా నేటి నుంచి అక్టోబర్ నెల 16వ తేదీ వరకు మండలంలోని గ్రామాలవారీగా నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహులు శుక్రవారం తెలిపారు. ప్రతి వలంటీరు వారి పరిధిలోని దీర్ఘకాలిక వ్యాధులు, వైద్య పరమైన సమస్యలు ఉన్న వారిని క్యాంపునకు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. యాప్ ద్వారా ప్రతి ఇంటిలో దీర్ఘకాలిక వ్యాధులతోపాటు వైద్య పరమైన సమస్యలను గుర్తించి వారికి టోకన్లు అందించినట్లు ఆయన తెలిపారు.

నేడు పాటూరులో..

నందలూరు (రాజంపేట) : నందలూరు మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మేడా విజయ్ భాస్కర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి పాల్గొననున్నట్లు వారు తెలిపారు.

'మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి'



వైద్యులను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

రాయచోటి అర్బన్ : ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరూ గుర్తెరిగి తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు మహేశ్వరరాజు, ఎన్.ఆర్.భాస్కర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం ఆసుపత్రిలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్‌హార్ట్ డేను పురస్కరించుకుని సేవ్ హార్ట్ అనే అంశంపై రోగులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకు మారుతున్న జీవన విధానం, ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి వలన గుండె సంబంధమైన వ్యాధులు ఉత్పన్నమవుతున్నాయన్నారు. చెడు అలవాట్లు, జంక్ ఫుడ్‌ను తీసుకోవడం వలన గ్యాస్ ట్రబుల్ వలన చాతినొప్పి వచ్చి గుండె సంబంధిత వ్యాధులని భావిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ పోషకాహారాన్ని తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ప్రశాంతంగా జీవించడం ద్వారా వ్యాధుల బారినపడకుండా కాపాడుకోవచ్చునన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు మహేశ్వరరాజు, ఎస్.ఆర్.భాస్కరరెడ్డి, రమేష్‌రాజు, నాగరాజు, శైలేష్‌లను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు నిజాముద్దీన్, కార్యదర్శి షౌకత్ అలీఖాన్, మాజీ అసిస్టెంట్ గవర్నర్ క్రిష్ణదేవరాయలు, జిల్లా అధికారి సయ్యద్ అష్రఫ్‌తో పాటు ఆసుపత్రి సిబ్బంది, ఆశ వర్కర్లు, రోగులు పాల్గొన్నారు.

ఆలయాల్లో వైభవంగా విగ్రహ ప్రతిష్ట



చిట్వేలి: విగ్రహాలను ప్రతిష్ఠించిన దృశ్యం

చిట్వేలి : రాజుకుంట పంచాయతీ అశోక్ నగర్ ఎస్టీ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర, లక్ష్మణ, ఆంజనేయ శేఖర కలశ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రారంభమైన ప్రతిష్ట మహోత్సవం శుక్రవారంతో ముగిసింది. సమరసత సేవా ఫౌండేషన్ ద్వారా ఆలయ నిర్మాణానికి టీటీడీ వారు రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేశారు. శుక్రవారం ప్రాతకాలపూజలు అనంతరం ఉదయం తులాలగ్న మందు విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట తదితర పూజలను చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సమరసత సభ్యులు పాండు రంగరాజు, సుబ్బరాయుడు ఆచారి, ఆలయ ఇన్‌చార్జ్ రామ్మోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో నిర్మించిన నూతన రామాలయంలో సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్రుని విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు, హోమాలు యాగాది క్రతువులను జరిపారు. ఆలయ నిర్మాణం రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సహకారంతో టీటీడీ నిధులతో శ్రీరామాలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ప్రారంభోత్సవానికి డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ప్రముఖ న్యాయవాది ప్రభాకర్ రెడ్డి, మండల నాయకులు వివి ప్రతాప్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పవిత్ర మట్టి కలశాలు అందజేత



మట్టి కలశాన్ని అందజేస్తున్న యదుభూషణ్‌రెడ్డి

సంబేపల్లె : నా మట్టి.. నాదేశం కార్యక్రమంలో భాగంగా సంబేపల్లె మండలంలోని దేవపట్ల సచివాలయంలో నా మట్టి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అన్ని పంచాయతీల నుంచి సేకరించిన మట్టిని శుక్రవారం డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి ఎంపీడీఓ నరసింహులకు మట్టి కలశాలను అందించారు. ఈ మట్టిని కడప నెహ్రూ యువకేంద్రం ద్వారా ఢిల్లీకి పంపుతున్నట్టు ఎంపీడీఓ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, ఏపీఓ రెడ్డి జవహర్, సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీలు, సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

గాలివీడులో

గాలివీడు : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ కలిసి దేశ ఐక్యత కోసం కృషి చేయాలన్నారు. అనంతరం మట్టిని నింపిన కలశాన్ని, మొక్కలను సచివాలయం సిబ్బందికి అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు సురేష్ కుమార్, రాధికారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ వరలక్ష్మి, ఏఎన్‌ఎం జ్యోతి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.